

7న శ్రీకూర్మ క్షేత్రం మూసివేత



గార, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): కూర్మనాథ క్షేత్రాన్ని ఈ నెల 7న భాద్ర పద పూర్ణిమ చంద్ర గ్రహణం సందర్భంగా మూసివేయనున్నట్టు ఆలయ ఈవో కె.నరసింహ నాయుడు, ప్రధాన అర్చకులు సీహెచ్ సీతారామ నరసింహాచార్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం మూడున్నర గంటల నుంచి సోమవారం ఉదయం వరకు ఆలయాన్ని మూసివేస్తామన్నారు. సంప్రోక్షణ అనంతరం స్వామి దర్శనానికి భక్తులను అనుమతిస్తామని తెలిపారు.

ఆగస్టు ఆదుకుంది



శ్రీకాకుళంలో మంగళవారం రాత్రి కురుస్తున్న వర్షం

- గత నెలలో లోటును అధిగమించి వర్షం
- ఈ నెలలోనూ అదేరీతిన కురిసే అవకాశం
- అన్నదాతల్లో ఆనందోత్సాహాలు

శ్రీకాకుళం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి):

జిల్లాలో ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. జూన్, జూలై నెలల్లో లోటు వర్షపాతంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. కానీ ఆగస్టులో మాత్రం వరుణుడు కరుణించాడు. లోటును అధిగమించి భారీ వర్షాలు కురవడంతో ప్రస్తుతం జిల్లాలో జలకళ ఉట్టిపడుతోంది. రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. వాతావరణ గణాంకాల ప్రకారం జిల్లాలో జూన్‌లో 116.67 మిల్లీమీటర్ల వర్షపాతం కురవాల్సి ఉంది. కానీ 96.97 మిల్లీమీటర్లు మాత్రమే వర్షపాతం నమోదైంది. జూలైలో 184.41 మిల్లీమీటర్ల వర్షపాతానికిగానూ 157.61 మిల్లీమీటర్లు మాత్రమే కురిసింది. ఈ రెండు నెలల్లో లోటు వర్షపాతం కారణంగా చెరువులు ఎండిపోయాయి. భూగర్భ జలాలు కాస్త అడుగంటాయి. వర్షాకాలంలోనూ జిల్లాప్రజలు వేసవి తాపాన్ని చవి చూశారు. ఖరీఫ్ సాగు ప్రారంభ దశలో రైతులు తీవ్ర నిరాశకు గురయ్యారు. వర్షాలు అనుకూలించకపోవడంతో శివారు భూముల్లో ఈ ఏడాది పంటలు పండవేమోనని ఆందోళన చెందారు. కాగా.. బంగాళాఖాతంలో ఏర్పడిన వరుస అల్పపీడనాలతో ఆగస్టులో భారీ వర్షాలు కురిశాయి. పంట పొలాలు చెరువుల్లా మారిపోయాయి. ఎటు చూసినా (మిగతా 6వ పేజీలో..)

జిల్లాలో ఆగస్టులో నమోదైన వర్షపాతం వివరాలు (మిల్లీమీటర్లలో)

మండలం	కురవాల్సినది	కురిసినది	మండలం	కురవాల్సినది	కురిసినది
ఆమదాలవలస	184.2	277.8	నందిగాం	196	183.54
బూర్జ	193.5	277.1	నరసన్నపేట	165.2	252.58
ఎచ్చెర్ల	170	295.35	పలాస	200.9	184.87
జి.సిగడాం	182.6	276.04	పాతపట్నం	162.1	202.39
గార	152.2	262.91	పోలాకి	169.1	243.08
హిరమండలం	168.6	232.2	పొందూరు	180.6	286.9
ఇచ్ఛాపురం	196.8	183.72	రణస్థలం	171.9	279.53
జలుమూరు	151	242.85	సంతబొమ్మాళి	192.6	213.91
కంచిలి	205.1	177.96	సారవకోట	201.4	220.12
కవిటి	204.9	179.68	సరుబుజ్జిలి	167.7	259.97
కోటబొమ్మాళి	188.8	227.09	సోంపేట	169.8	178.64
కొత్తూరు	205.2	231.32	శ్రీకాకుళం	159.5	279.31
లావేరు	164.2	290.32	టెక్కలి	210.5	199.08
ఎల్.ఎన్.పేట	167.7	255.87	వజ్రపుకొత్తూరు	179.8	182.35
మందస	198.9	183.53			
మెళియాపుట్టి	197.3	189.75	మొత్తం	181.94	229.56

కుండపోత

- జిల్లాలో ఎడతెరిపిలేని వర్షం
- నీట మునిగిన పొలాలు

6లో

బస్సు ఎక్కాలంటే.. ఈత రావాలి

- సిక్కోలు ఆర్టీసీ కాంప్లెక్స్ జలమయం
- చినుకు పడితే ప్రయాణికులకు కష్టాలే

అమ్మో.. హైవే!

- అస్తవ్యస్తంగా జాతీయ రహదారి నిర్వహణ
- వర్షం పడితే నిలిచిపోతున్న నీరు
- జలదిగ్బంధంలో సర్వీసు రోడ్లు
- కాలువల నిర్వహణపై నిర్లక్ష్యం
- తరచూ రోడ్డు ప్రమాదాలు
- దృష్టి సారించని అధికారులు



ఇటీవల శ్రీకాకుళం సమీపంలోని పెద్దపాడు వద్ద జాతీయ రహదారిపై సుమారు కిలోమీటరు మేర వరద నీరు నిలిచిపోయింది. రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. హైవే నిర్మాణ సమయంలో నిబంధనలు పాటించకపోవడంతో సమీపంలోని గెడ్డలు, వరద నీరు హైవేపై పోటెత్తుతుండడంతో తరచూ ఈ సమస్య తలెత్తుతోంది.

- వారం కిందట విజయనగరం జిల్లా భోగాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో జిల్లా వాసులు నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. బూర్జ నుంచి విశాఖకు కారులో వెళ్తుండగా హైవేపై నిలిచిన వర్షపు నీరు వచ్చి అద్దాలపై పడడంతో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది.
- ఏడాది కిందట జిల్లాలోని పోలిపల్లి జంక్షన్ వద్ద హైవేపై జరిగిన ప్రమాదంలో ఓ ప్రముఖ బంగారం వ్యాపారి అల్లుడుతో పాటు ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. వీరు తెల్లవారుజామున కారులో విశాఖ వెళ్తున్న సమయంలో వర్షం కురిసింది. పోలిపల్లి జంక్షన్ వద్ద హైవేపై ఉన్న వరద నీరు ఒక్కసారిగా కారుపై పడడంతో వాహనం అదుపు తప్పింది. డివైడర్ అవతలివైపు దూసుకెళ్లి ప్రమాదం జరిగింది.
- లావేరు మండలం సుభద్రాపురం జంక్షన్ వద్ద చిన్నపాటి వర్షానికే జాతీయ రహదారి జల దిగ్బంధంలో చిక్కుకుంటోంది. లోతట్టు ప్రాంతాల నుంచి వరద నీరు వచ్చి వంతెన కిందన నిల్వ ఉండిపోతోంది. ఆ సమయంలో వాహన చోదకులు, ప్రయాణికులు పడే బాధలు వర్ణనాతీతం. అక్కడ హైవే వరద నీరును కాలువల్లోకి మళ్లించేందుకు సరైన ఏర్పాట్లు చేయలేదు. అందుకే ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

రణస్థలం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి):

చిన్న వర్షం పడితే చాలు జాతీయ రహదారిపై వరదనీరు నిలిచిపోతోంది. హైవే నిర్మాణంలో లోపాలు, పూర్తిస్థాయి నిర్వహణ లేకపోవడంతో వర్షాల సమయంలో చాలాచోట్ల రహదారులు జలదిగ్బంధం అవుతున్నాయి. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ట్రాఫిక్ ఇబ్బందులు కూడా ఎదురై.. హైవేపై ప్రయాణించేవారు, సమీపంలోని నివాసితులు అవస్థలు పడుతున్నారు. జిల్లాలో పైడిభీమవరం నుంచి ఇచ్ఛాపురం వరకూ 196 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి ఉంది. పైడిభీమవరం నుంచి నరసన్నపేట వరకూ ఆరు వరుసలుగా 54 కిలోమీటర్ల రోడ్డు ఉంది. అక్కడ నుంచి ఇచ్ఛాపురం వరకు మాత్రం నాలుగు వరుసలుగా 85 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. మధ్యలో రణస్థలం మండల కేంద్రంలో ఇప్పుడు ఫ్లైఓవర్ నిర్మిస్తున్నారు. హైవేపై 30 వంతెనలు, 80 కిలోమీటర్ల మేర సైడ్ కాలువలు, సర్వీసు రోడ్లు ఉన్నాయి. అయితే, నిర్మాణ సమయంలో సరైన ప్రణాళిక, నిబంధనలు పాటించకపోవడంతో వర్షంపడితే హైవేపై, సర్వీసు రోడ్లపై ఎక్కడికక్కడే నీరు నిలిచిపోతోంది. ఏటా వర్షాకాలంలో ఇబ్బందులు రావడం, అధికారులు హడావుడి చేయడం, తరువాత మరిచిపోవడం పరిపాటిగా మారిందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

పర్యవేక్షణ కరువు..

జాతీయ రహదారుల నిర్వహణ బాధ్యతను టోల్ వసూలు చేసే కాంట్రాక్ట్ సంస్థలు చూడాలి. ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలి. గతుకులు, గుంతలు ఉన్న ప్రాంతంలో మరమ్మతులు చేయాలి. మొక్కల పరిరక్షణ, విద్యుద్దీపాలంకరణ, వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టడం వంటివి చేయాలి. కానీ, జిల్లాలో మాత్రం తూతూమంత్రంగా పర్యవేక్షణ చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. సర్వీసు రోడ్లకు ఇరువైపులా ఉన్న కాలువల్లో పూడికతీత పనులు చేపట్టడం లేదు. దీంతో వరద వెళ్లే మార్గం లేక సర్వీసు రోడ్లపై నీరు నిల్వ ఉండిపోతోంది. ఆ మార్గంలో వాహనాలు ప్రయాణించేటప్పుడు ఆ స్పీడ్‌కు వరద నీరు తుళ్లి పక్కనే హైవేపై వెళ్తున్న వాహనాలపై పడుతోంది. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. సమస్య తలెత్తిన చోట తాత్కాలికంగా పనులు చేపట్టి సంబంధిత కాంట్రాక్టు సంస్థలు చేతులు దులుపుకొంటున్నాయనే విమర్శలు ఉన్నాయి.



పైడిభీమవరం జాతీయ రహదారిపై వర్షపు నీటిలో వెళ్తున్న ఆర్టీసీ బస్సు

సక్రమంగా లేని కాలువలు..

రణస్థలం మండలం పైడిభీమవరం, కోష్ట, పతివాడపాలెం (మిగతా 6వ పేజీలో..)

ఇక్కడ అన్నీ సమస్యలే

- టెక్కలి ఆసుపత్రిలో సమయపాలన పాటించని వైద్యులు
- అరకొర సిబ్బందితో అవస్థలు
- రోగులకు సక్రమంగా అందని సేవలు
- బయటి దుకాణాల్లోనే మందుల కొనుగోలు
- నేడు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సలహా సంఘ సమావేశం

టెక్కలి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): టెక్కలిలోని జిల్లా కేంద్రాసుపత్రిలో సమస్యలు తిష్ట వేశాయి. ప్రధానంగా పూర్తిస్థాయిలో సిబ్బంది లేరు. వైద్యానికి అవసరమైన సామగ్రి, మందుల కొరత వేధిస్తోంది. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మొదలుకొని ఆరోగ్యశాఖ డైరెక్టర్ అట్టాడ సిరి వరకు ఎంతమంది సమీక్షిస్తున్నా.. వైద్యులు, సిబ్బంది తీరు మారడం లేదు. వారు సమయపాలన పాటించకపోవడంతో రోగులకు సక్రమంగా సేవలు అందడం లేదు. ఇటీవల మంత్రి అచ్చెన్నాయుడు ఈ ఆస్పత్రిని పరిశీలించగా 30మంది వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదనే విషయాన్ని గుర్తించి మందలించారు. అలాగే ఇక్కడ వైద్యులు, సిబ్బంది 32మంది వరకు కొరత ఉంది. స్టాఫ్‌నర్సులు కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఆసుపత్రికి ఇన్‌పేషెంట్లు సుమారు 140మంది, ఔట్‌పేషెంట్లు 600మంది వరకు రోజూ వస్తున్నారు. సరిపడా మందులకు బడ్జెట్ చాలడం లేదు. సర్జికల్‌కు సంబంధించి మూడు కోట్లకు రూ.14.25 లక్షలు, మందులకు సంబంధించి నాలుగు కోట్లకు రూ.79.76లక్షలు విడుదల చేశారు. అవి చాలకపోవడంతో వైద్యులు (మిగతా 6వ పేజీలో..)



ఆస్పత్రిలో కుర్చీలు లేక కింద కూర్చున్న రోగులు



టెక్కలిలో జిల్లా కేంద్రాసుపత్రి

భార్యతో తగాదా పడి.. గొంతుకోసుకుని

- పలాసలో కళాసీ ఆత్మహత్యాయత్నం

పిడుగుపడి రైతు మృతి

వేర్వేరు ఘటనల్లో నలుగురి మృతి

8లో



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

స్వచ్ఛ శ్రీకాకుళం సాధనకు నిబద్ధతతో పనిచేయాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ శ్రీకాకుళం, స్వచ్ఛాంధ్ర సాధనకు ప్రతీ ఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. ప్రజలందరూ స్వచ్ఛతను జీవన విధానంలో భాగంగా చేసుకోవాలని కోరారు. స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో ఈవోపీఆర్డీలు, పంచాయితీ కార్యదర్శులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 'ప్రతీ నెల మూడవ శనివారం నిర్వహించే 'స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్' బాధ్యతగా నిర్వర్తించాలి. ఒకరోజు కార్యక్రమంతో సరిపెట్టకుండా, ప్రతీరోజు ప్రజల సహకారంతో గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి. ఇంటింటా చెత్త సేకరణలో నిర్లక్ష్యం వద్దు. ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా ప్రజల నుంచి సానుకూల స్పందన రావాలి. కొన్ని గ్రామాల్లో పరిశుభ్రతపై వ్యతిరేకత కనిపిస్తోంది. పారిశుధ్య కార్మికుల హాజరు, పనుల ప్రణాళిక, మోనటరింగ్ వంటి అంశాలపై అధికారులు కచ్చితంగా (మిగతా 6వ పేజీలో..)

పలాసలో జీడి బోర్డు



జీడి పరిశ్రమలో కార్మికులు

- ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు
- కేంద్రమంత్రితో చర్చించిన మంత్రి లోకేశ్
- రామకృష్ణాపురం వద్ద 70 ఎకరాల కేటాయింపు



కేంద్ర పరిశ్రమలశాఖ మంత్రి పీయూష్‌గోయల్‌తో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ (ఫైల్)

పలాస, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జీడి బోర్డు ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయి. ఈ అంశంపై ఇటీవల కేంద్ర పరిశ్రమలశాఖ మంత్రి పీయుష్‌గోయల్‌ను టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ కలిసి చర్చించారు. రాష్ట్రంలో జీడి, మిర్చి, మామిడి బోర్డులు ఏర్పాటు చేయాలని లోకేశ్ కోరగా కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. ఇప్పటికే పలాస జీడిపప్పు తిరుపతి దేవస్థానానికి సరఫరా అవుతోంది. జీడిబోర్డు ఏర్పాటు చేస్తే పలాస జీడికి తిరుగుండదని రైతులు, వ్యాపారులు పేర్కొంటున్నారు.

అంతర్జాతీయ గుర్తింపు

దేశంలో జీడి ఉత్పత్తుల ఎగుమతులు, దిగుమతుల్లో రాష్ట్రం రెండో స్థానంలో ఉంది. ముఖ్యంగా జీడిపప్పు ఉత్పత్తులకు కేంద్రమైన పలాస జీడికి అంతర్జాతీయంగా కూడా మంచి గుర్తింపు ఉంది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం శ్రీకాకుళం జిల్లా జీడి ఉత్పత్తులకు సముచిత స్థానం ఇచ్చిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో జీడి ఉత్పత్తులు మరింతగా గుర్తింపు పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా జీడి బోర్డు ఏర్పాటుకు కృషి చేస్తోంది. జిల్లాలో 400కు పైగా జీడి పరిశ్రమలు ఉండగా ఒక్క పలాస, టెక్కలి డివిజన్లలోనే 350 పైగా ఉన్నాయి. పలాసలో ఇంగిలిగాం పారిశ్రామిక వాడలో 50 దాకా ఉండగా, దానికి అనుబంధ పరిశ్రమలు నాలుగు ఉన్నాయి. వాటి ద్వారా 15వేలకు పైగా కార్మికులకు ఉపాధి లభిస్తోంది. జిల్లావ్యాప్తంగా 30వేల హెక్టార్లలో ప్రస్తుతం జీడి సాగవుతోంది. వరి తరువాత అతిపెద్ద పంటగా సాగులో ఉండగా వాణిజ్యంలో మొదటిస్థానంలో ఉంది. ఇక్కడ అవసరాలకు స్థానికంగా పండే జీడి గింజలు చాలకపోవడంతో విదేశాల నుంచి ఏటా 50వేల టన్నుల వరకూ పిక్కలను దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. పంటలపై సరైన విధానాలు అవలంబించకపోవడం, ఏటా ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడల కారణంగా ఆశించినంతగా దిగుబడి లేకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీనికితోడు గిట్టుబాటు ధరలు లేక రైతులు అవసరాల మేరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉంది.

ఇవీ ప్రయోజనాలు

జిల్లాలో జీడిబోర్డు ఏర్పాటయితే రైతులు, వ్యాపారులకు ఎంతో ప్రయోజనం కలగనుంది. జీడిప్రాసెసింగ్, (మిగతా 6వ పేజీలో..)

టీడీపీ త్రిసభ్య కమిటీ వినతుల స్వీకరణ

7లో

గంజాయి కేసుల్లో దర్యాప్తు వేగవంతం

- ఎస్పీ మహేశ్వరరెడ్డి

6లో

కుండపోత

- జిల్లాలో ఎడతెరిపిలేని వర్షం
- నీట మునిగిన పొలాలు
- రోడ్లు, వీధులు జలమయం
- చెరువులకు జలకళ

జిల్లా వ్యాప్తంగా మంగళవారం కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి రాత్రి వరకు వర్షం కురుస్తూనే ఉంది. దీంతో పొలాలు నీట మునిగాయి. కొన్నిచోట్ల ఇటీవల కురిసిన వర్షాలకు నీరు ఇంకా పొలాల్లోనే ఉంది. తాజా వర్షంతో మరింతగా చేరింది. రహదారులు, వివిధ గ్రామాలు, పట్టణాల్లోని వీధుల్లో మోకాలి లోతున నీరు ప్రవహించింది. ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగింది.

- ఆంధ్రజ్యోతి బృందం


జలుమూరు: కరవంజ పెద్దచెరువు చప్టా వద్ద ఇలా..


ఎల్ఎన్‌పేట: జోరుగా కురుస్తున్న వర్షం


హరిపురం: కుంటికోట వద్ద నీట మునిగిన పంట పొలాలు


టెక్కలి: చిన్నబజారు ప్రాంతంలో రోడ్డుపై నిలిచిన నీరు


హరిపురం: ప్రమాదకర స్థాయిలో సంకుజోడి కాలువ


నరసన్నపేట: లక్ష్మీనగర్‌లో రోడ్డు మీద నిలిచిన మురుగునీరు


టెక్కలి రూరల్: కాలువలో వరద ప్రవాహం


జలుమూరు: తిలారు అండర్ పాసేజీ వద్ద ఇలా..


వంతెన వద్ద నిలిచిపోయిన విద్యార్థులు, వాహనాలు

ఉధృతంగా రాధాసాగరం ప్రవాహం

మెళియాపుట్టి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఒడిశాలో కురుస్తున్న భారీ వర్షాలతో రాధాసాగరం ఉప్పొంగుతోంది. దీని చెంతన ఉన్న గోకర్ణపురానికి ముంపు ముప్పు ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం కుండపోత వర్షం కురవడంతో రాధాసాగరంలో ప్రవాహం పెరిగింది. వంతెన మీదుగా నీరు ప్రవహిస్తోంది. ఉదయం మామూలుగా ఉన్న ప్రవాహం... సాయంత్రానికి పెరగడంతో పాఠశాలలకు వెళ్లిన విద్యార్థులు గ్రామానికి చేరుకోవడానికి అవస్థలు పడ్డారు. కొంతమంది చిన్నహంస గ్రామం మీదుగా పొలం గట్లపై నుంచి ఊరికి చేరుకున్నారు. ప్రవాహం కొనసాగితే అత్యవసర పరిస్థితుల్లో రాకపోకలకు ఇబ్బందులు పడాల్సి వస్తుందని గోకర్ణపురం గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బస్సు ఎక్కాలంటే.. ఈత రావాలి!

- సిక్కోలు ఆర్టీసీ కాంప్లెక్స్ జలమయం
- చినుకు పడితే ప్రయాణికులకు కష్టాలే


ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో నీరు


విద్యార్థుల కష్టాలు


నీటిలో బస్సు ప్రయాణం

మీరు శ్రీకాకుళంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సు ఎక్కాలని అనుకుంటున్నారా? అయితే మీకు బాగా ఈదడం తెలిసి ఉండాలి. అదేంటీ.. బస్సు ఎక్కడానికి... ఈతకు సంబంధమేంటీ అంటారా? అయితే ఈ చిత్రాలు చూడండి. ఎందుకలా చెబుతున్నామో మీకే అర్థమవుతుంది. ఇంకా సందేహాలు ఉంటే వర్షం కురిసేటపుడు శ్రీకాకుళంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్లి చూస్తే సరి. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ఏమాత్రం వర్షం కురిసినా మొదట ప్రభావం కనిపించేది ఇక్కడి ఆర్టీసీ కాంప్లెక్స్‌లోనే. చిన్నపాటి చినుకులకే ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ చెరువులా తయారవుతుంది. మోకాలి లోతు నీటిలో ప్రయాణికులు నడవాల్సి ఉంటుంది. బస్సుల్లో వచ్చేవారు ఇక్కడ దిగాలంటేనే భయపడేంతగా నీరు ఉంటుంది. విద్యార్థులు, మహిళలు, వృద్ధుల కష్టాలైతే ఇంక చెప్పక్కరలేదు. ఏళ్ల తరబడి ఇదే పరిస్థితి ఉంటున్నా... సరిదిద్దేందుకు యంత్రాంగం... ప్రజాప్రతినిధులు తీసుకున్న చర్యలు కనిపించడం లేదు.

- అరసవల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి)

అమ్మో.. హైవే!

(ఐదో పేజీ తరువాయి)

నెలివాడ కూడళ్లలో ఫ్లైఓవర్ల వద్ద సర్వీసు రోడ్లను సక్రమంగా నిర్మించలేదు. ఇక్కడ కాలువలు కూడా సక్రమంగా లేవు. నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండడంతో వర్షపు నీరు పూర్తిగా నిలిచిపోతోంది. లావేరు మండలం సుభద్రాపురం జంక్షన్, ఎచ్చెర్ల మండలం అరిణాం అక్కివలస, చిలకపాలెం, కేశవరావుపేట, నవభారత్ జంక్షన్ వద్ద కూడా అదే పరిస్థితి. నరసన్నపేట మండల కోమర్తి, సింగుపురం జంక్షన్ వద్ద సైతం వరద నీరు పోటెత్తుతోంది. ఇంత జరుగుతున్నా హైవే అధికారులు తాత్కాలిక చర్యలతోనే సరిపెడుతున్నారు.

వెలగని విద్యుత్ దీపాలు..

జాతీయ రహదారికి సంబంధించి 30 వంతెనల వద్ద, గ్రామాలకు వెళ్లే సర్వీసు రోడ్ల వద్ద దాదాపు 900 విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి ఎల్ఈడీ దీపాలను అమర్చారు. ప్రారంభంలో ఇవి బాగానే వెలిగాయి. తర్వాత నిర్వహణ బాగా లేక వెలగడం లేదు. బుడుమూరు, సుభద్రాపురం, తాళ్లవలస, ఎచ్చెర్ల, శ్రీకాకుళం సింహద్వారం, పెద్దపాడు, సింగుపురం, మడపాం వద్ద పూర్తిస్థాయిలో విద్యుత్ లైట్లు వెలగడం లేదు. చాలాచోట్ల ఈ దీపాలకు సంబంధించి ఏర్పాటు చేసిన ఫ్యూజు బాక్సులు సైతం అస్తవ్యస్తంగా ఉన్నాయి. ఇప్పటికైనా జాతీయ రహదారి విభాగం అధికారులు వంతెనలు, సర్వీసు రోడ్ల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు, విద్యుత్ లైట్లు వెలిగేలా చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఫిర్యాదు చేశాం

జాతీయ రహదారి నిర్వహణకు సంబంధించి హైవే అధికారులకు ఇప్పటికే ఫిర్యాదు చేశాం. అవసరమైతే కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుతో కలిసి రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలుస్తాం. సర్వీసు రోడ్లు, కాలువల విషయమై మాట్లాడతాం. సత్వర చర్యలు చేపడతాం.

-కలిశెట్టి అప్పలనాయుడు, ఎంపీ, విజయనగరం

ఆగస్టు ఆదుకుంది

(ఐదో పేజీ తరువాయి)

జలమయం కనిపించింది. ఆగస్టులో గణాంకాల ప్రకారం 181.94 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా... ఏకంగా 229.56 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. లోటు వర్షపాతాన్ని అధిగమించింది.

- ఈ నెల 1న 13.23 మిల్లీమీటర్ల వర్షపాతం కురవాల్సి ఉండగా... 17.63 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మంగళవారం కూడా జిల్లాఅంతటా భారీ వర్షం కురిసింది. మరో మూడు రోజులపాటుభారీ వర్షాలు కురిసే అవకాశముందని.. ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ఈ నెలలో కూడా జిల్లాలో వర్షాలు సమృద్ధిగా కురిసే అవకాశముందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సాగునీటికి ఇబ్బందులు ఉండవని భావిస్తున్నారు.

అవార్డులు సాధించేందుకు కృషి చేయండి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు అధిక సంఖ్యలో స్వచ్ఛాంధ్ర అవార్డులు సాధించేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. రాష్ట్రస్థాయిలో గెలుచుకున్న వారికి రూ.లక్ష, జిల్లా స్థాయి అవార్డుకు రూ.25 వేలు ప్రోత్సాహకంగా అందజేస్తామన్నారు. తన కార్యాలయం నుంచి ఆయన మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అక్టోబరు 2న జరిగే కార్యక్రమంలో స్వచ్ఛ మున్సిపాలిటీలు, పంచాయతీలు, పాఠశాలలు, అంగన్‌వాడీలు, ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్లు, రైతుబజార్లు, హాస్టల్స్, పరిశ్రమలు, ఎంఎస్ఎంఈలు, స్వచ్ఛతా వారియర్స్ తదితర విభాగాల్లో రాష్ట్ర స్థాయిలో 52, జిల్లా స్థాయిలో 1421 అవార్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే జిల్లాలో ఎక్కడా యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎరువుల సరఫరాపై పరిశీలనకు కోపరేటివ్, మార్క్‌ఫెడ్, పోలీసు, రెవెన్యూ అధికారులతో జాయింట్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశామన్నారు. ఎమ్మార్పీ కన్నా ఎక్కువకు అమ్మితే కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసారు. స్వర్ణాంధ్ర 2047లో 21 శాఖల ప్రతిభ, 2025-26లో 31 శాఖల రిపోర్టులను వెంటనే అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ డి.పృథ్వీరాజ్‌కుమార్, డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు, ఉప కలెక్టర్ పద్మావతి, డీపీఓ భారతీ సౌజన్య, జెడ్పీ సీఈవో శ్రీధర్‌రాజా, సీపీఓ ప్రసన్నలక్ష్మి, డీఎస్పీ సీహెచ్.వివేకానంద తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఇక్కడ అన్నీ సమస్యలే

(ఐదో పేజీ తరువాయి)

కొన్నిరకాల మందులను బయట రోగులతో కొనుగోలు చేయిస్తున్నారు. ఆర్థోపెడిక్ ఆపరేషన్ల సమయాల్లో అవసరమైన సామగ్రి లేదని ఓ వైద్యుడు ఏకంగా బయటే రోగులచే కొనిపించడం పరిపాటిగా మారింది.

మూతపడిన అల్ట్రాసౌండ్ స్కానింగ్..

రేడియాలజిస్ట్ లేకపోవడంతో అల్ట్రాసౌండ్ స్కానింగ్ మూతపడింది. వెంటిలేటర్లు ఉన్నా నిపుణులు లేక వాటిని వినియోగించని పరిస్థితి నెలకొంది. ఆసుపత్రికి తరచూ విద్యుత్ హెచ్చుతగ్గుల సమస్యలతో ఆపరేషన్ థియేటర్‌లో పలు పరికరాలు దెబ్బతింటుండగా ల్యాబ్ పరీక్షలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆసుపత్రిలో లిఫ్ట్ ఎప్పుడు పనిచేస్తుందో, ఎప్పుడు మొరాయిస్తుందో తెలియని పరిస్థితి నెలకొందని రోగులు వాపోతున్నారు. రోగులు బెడ్ల మీద పరిచే దుప్పట్లు, ఆపరేషన్ థియేటర్‌లోని దుస్తులు తడిపేందుకు దోబీ లేరు. దీంతో శానిటేషన్ సిబ్బందితో తాత్కాలికంగా దోబీ పనులు చేయించాల్సి వస్తోంది. మంచాలపై ఒక్కోసారి దుప్పట్లు ఉండడం లేదని రోగులు వాపోతున్నారు. బెంచ్‌లు, కుర్చీలు సౌకర్యం లేదు. బయోమైక్రోల్యాబ్ నిరుపయోగంగా మారింది. ఈసీజీ టెక్నీషియన్ లేకపోవడంతో ఇతర సిబ్బందితో ఆ పనులు తూతూమంత్రంగా చేయించాల్సి వస్తోంది.

ఫ్రీజర్, అంబులెన్స్‌లు లేవు..

ఆసుపత్రి ప్రాంగణంలో పారిశుధ్య నిర్వహణ గాడితప్పింది. ఆసుపత్రి వెనుక ప్రాంతంలో మురుగునీటి సమస్య వెంటాడుతోంది. ప్రమాదంలో ఎవరైనా చనిపోయిన వ్యక్తుల మృతదేహాలు ఉంచడానికి ఫ్రీజర్ సౌకర్యం లేదు. దీంతో మూడు కిలోమీటర్ల దూరంలో గల పాత జిల్లా కేంద్ర ఆసుపత్రిలో కరెంటు లేని గదిలో మృతదేహాలను పడేస్తున్నారు. అంబులెన్స్‌ల సౌకర్యం లేకపోవడంతో రోగులను అత్యవసర పరిస్థితుల్లో తరలించేందుకు అవస్థలు తప్పడం లేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు వస్తున్నారని తెలిస్తే పరిశుభ్రతతో పాటు రోగులు మంచాలపై బెడ్‌షీట్లు వేసి కాలం వెళ్లబుచ్చుతున్నారు. బుధవారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సలహా సంఘ సమావేశం జరగనుంది. ఈ నేపథ్యంలో ఈ సమావేశంలోనైనా సమస్యలపై చర్చించి.. సౌకర్యాలు మెరుగుపడేలా, సక్రమంగా సేవలు అందించేలా అధికారులు, పాలకులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

స్వచ్ఛ శ్రీకాకుళం సాధనకు నిబద్ధతతో పనిచేయాలి

(ఐదో పేజీ తరువాయి)

పర్యవేక్షించాలి. విద్య, వైద్యం, ఉపాధి, పారిశుద్ధ్యం, మంచినీరు, మౌలిక సదుపాయాలు, అక్షరాస్యత వంటి అంశాలను సమగ్రంగా పరిగణించాలి. గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దడానికి ప్రతీ అధికారి బాధ్యత తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో డీపీవో భారతీ సౌజన్య, డీఎల్‌పీవో రమణ, టెక్కలి డీఎల్‌పీవో గోపీబాల, పంచాయితీ సెక్రటరీలు పాల్గొన్నారు.

గంజాయి కేసుల్లో దర్యాప్తు వేగవంతం

- ఎస్పీ మహేశ్వరరెడ్డి



శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న గంజాయి కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం జిల్లా పోలీసు కార్యాలయం నుంచి డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐ స్థాయి పోలీసు అధికారులతో గంజాయి కేసుల దర్యాప్తు, నాన్ బెయిలబుల్ వారెంట్స్ అమలు తదితర అంశాలపై జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. నాన్ బెయిలబుల్ వారెంట్ల విషయంలో నిర్లక్ష్యం వద్దన్నారు. ప్రాధాన్య క్రమంలో వాటిని అమలు చేసి వీలైనంత త్వరగా కోర్టుల్లో హాజరుపర్చాని సూచించారు. గంజాయి కేసుల పెండింగ్‌కు గల కారణా లపై ఆరా తీశారు. పాత నేరస్తులను బైండో వర్ చేయాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో డీసీఆర్ బీ సీఐ శ్రీనివాసరావు, సైబర్ సెల్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ గోవిదరావు పాల్గొన్నారు.

పలాసలో జీడిబోర్డు

(ఐదో పేజీ తరువాయి)

ఆధునికీకరణ, పారదర్శకమైన వ్యాపారం, రైతులకు మెరుగైన ధరలు అందించడానికి మార్గం సుగమం అవుతుంది. సాంకేతికంగా అభివృద్ధి చెందడంతో పాటు రైతులు, వ్యాపారులకు ప్రభుత్వమే తగు సూచనలు చేస్తూ దిగుబడి పెంచడంతో పాటు నష్టం లేకుండా రైతులు తమ పంటలు విక్రయించు కోవడానికి అవకాశం ఏర్పడుతుంది. జీడి, దాని అనుబంధ పరిశ్రమలు స్థాపించడానికి కూడా యువ వ్యాపారులకు అవగాహన ఏర్పాటు చేయడం, వారితో పరిశ్రమలు స్థాపించి ప్రోత్సాహకాలు ఇచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. రెండు రోజుల కిందట జిల్లా కేంద్రంలో కలెక్టర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ జీడి వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. జీడి పరిశ్రమలకు ఇచ్చే ప్రోత్సాహకాలు కలెక్టర్ ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యంగా చిన్నతరహా పరిశ్రమలను ప్రోత్సహించడానికి ఇప్పటికే నియోజకవర్గానికి ఒక పారిశ్రామిక పార్కు మంజూరు చేసింది. నామమాత్రపు ధరకు వ్యాపారులకు అవసరమైన స్థలాలు ఇచ్చి ప్రోత్సహిస్తుంది. ఈ మేరకు పలాస మండలం రామకృష్ణాపురం వద్ద 70 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. వాటిని ప్లాట్లుగా విభజించి ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రారంభించారు.

ఆంధ్రా ఉమెన్ టి-20 లీగ్‌లో మన విద్యార్థినులు


పి.వనజాక్షి


బూసు నవ్య

శ్రీకాకుళం స్పోర్ట్స్ సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో జరుగుతున్న ఉమెన్ ఆంధ్రా ప్రీమియర్ లీగ్ పోటీలకు జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థినులు వేర్వేరు జట్లలో స్థానాలను పదిలపరచుకున్నారు. కొత్తూరుకు చెందిన పి.వనజాక్షి రాయలసీమ రాణీస్ జట్టుకు ప్రాతినిథ్యం వహిస్తున్నారు. శ్రీకాకుళం బాలుర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న వనజాక్షి గత రెండేళ్ల నుంచి వివిధ ఫార్మాట్లలో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటూ ప్రతిభను చాటుకుంటోంది. వైజాగ్ చిత్రాస్ జట్టులో బూసు నవ్య స్థానాన్ని పదిలపర్చుకుంది. మంగళవారం ప్రారంభమైన ఈ పోటీలు ఈ నెల 9వ తేదీ వరకు జరుగనున్నాయి.

న్యూస్ బాక్స్

గణనాథుని సేవలో..

గార రూరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): కళింగపట్నం పంచాయతీ తాన్ సాహెబ్ పేటలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో మంగళవారం ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేసి అన్న సంతర్పణలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు లోపింటి రాధాకృష్ణారెడ్డి, జిల్లా వాణిజ్య విభాగం కార్యదర్శి పొట్నూరు కృష్ణమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు కిలుగు అప్పలనాయుడు పాల్గొన్నారు.

● సోంపేట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బారువలో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాల్లో ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు మంగళవారం పాల్గొన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీ యూ ప్రతినిధులు బైరి అప్పారావు, హరిశ్చంద్రుడు తదితరులున్నారు.

నారీశక్తిపై అవగాహన

గార రూరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): అంపోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు నారీశక్తిపై ఎస్ఐ గంగరాజు మంగళవారం అవగాహన కల్పించారు. పోక్సో చట్టం, సైబర్ నేరాలు, శక్తి యాప్ తదితర అంశాలను వవరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాటర్ ప్యూరిఫైయర్ అందజేత

కంచిలి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): చిన్నకొజ్జిరియా మండల పరిషత్ పాఠశాలకు గ్రామానికి చెందిన గొనప మధుబాబు తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ. 18 వేలు విలువ చేసే వాటర్ ప్యూరిఫైయర్‌ను మంగళవారం హెచ్‌ఎం రాజేంద్రప్రసాద్‌కు అందించారు. ఈ సందర్భంగా దాతను ఎస్‌ఎంసీ చైర్మన్ బెందాళం రవి, సర్పంచ్ గొనప సీతారాం, హెచ్‌ఎం అభినందించారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంఈవోగా శ్రీరాములు

లావేరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎంఈవోగా గట్టు శ్రీరాములు నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పొందూరు నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. శ్రీరాములుకు ప్రస్తుత ఇన్‌చార్జి ఎంఈవో వాగ్దేవి, ఎంఈవో మురళీకృష్ణ, హెచ్‌ఎం పి.జగన్నాథం తదితరులు బొకే ఇచ్చి అభినందించారు.

ఎంఈవో-1గా వాగ్దేవి

పొందూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎంఈవో-1గా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం.వాగ్దేవి నియమితులయ్యారు. ఎంఈవో-1గా పని చేసిన శ్రీరాములు లావేరుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వాగ్దేవి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. వాగ్దేవిని డిప్యూటీడీఈవో విజయకుమారి, ఎంఈవోలు శ్రీరాములు, రాజారావు, సిబ్బంది అభినందించారు.

వీర మహిళ స్వప్నకు స్వల్ప గాయాలు

రణస్థలం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): జనసేన వీర మహిళా నాయకురాలు స్వప్నకి స్వల్ప గాయాలయ్యాయి. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు మంగళవారం ఎమ్మెల్యే ఎన్‌ఈఆర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ద్విచక్ర వాహనంపై వచ్చిన ఆమె ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పి పడిపోవడంతో చిన్న గాయాలయ్యాయి. కొండ ములగాం సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న స్వప్నను జనసేన నేత విష్వక్సేన్ పరామర్శించారు.

సదుపాయాల కల్పనకు చర్యలు

ఆమదాలవలస, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వ పనిచేస్తోందని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీతాసాగర్ అన్నారు. మంగళవారం 13వ వార్డులో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కమిషనర్ తమ్మినేని రవి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు సంపదరావు మురళి, నాయకులు బోర గోవిందరావు, రాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

జి.సిగడాం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): డీఆర్‌వలస ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. హెచ్‌ఎం అరుణకుమారి ఆధ్వర్యంలో ఎన్‌పీసీబీ యూనిట్, డీబీసీఎస్ సౌజన్యంతో దూరదృష్టి లోపం ఉన్న విద్యార్థులను గుర్తించి మందులు అందించారు.

నూతన పీటీఆర్ ఏర్పాటుకు వర్షం అడ్డంకి

గార రూరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): తూలుగు విద్యుత్ ఉపకేంద్రం ఆవరణలో నూతన పీటీఆర్ ఏర్పాటు పనులకు వర్షం అంతరాయం కలిగించింది. 5ఎంవీఏ పీటీఆర్‌ను మంగళవారం ఏర్పాటు చేస్తున్న సమయంలో వర్షం కురవడంతో విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేసేందుకు అడ్డంకి ఏర్పడిందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పైడి యోగేశ్వరరావు తెలిపారు. దీంతో పనులు నిలుపుదల చేశామన్నారు. వినియోగదారుల సౌకర్యార్థం ఎప్పటిలాగే అలికాం, కళింగపట్నం, చల్లపేట సబ్ స్టేషన్ల నుంచి విద్యుత్ సరఫరా జరుగుతుందని తెలిపారు. బుధవారం నుంచి పనులు యథాతథంగా కొనసాగుతాయని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సాగులో ఆధునిక పద్ధతులను పాటించాలి: అశోక్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

కవిటి, సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): సాగులో ఆధునిక పద్ధతులను పాటించడం ద్వారా ప్రయోజనం పొందవచ్చని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బి.అశోక్ అన్నారు. మంగళవారం స్థానిక చికాఫ్ సంస్థ కార్యాలయంలో కొబ్బరి దినోత్సవం సందర్భంగా రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ స్థాయిలో ఉద్యానవనశాఖ ద్వారా నియమితులైనవారు ఎంతవరకు రైతులకు సాయం చేస్తున్నారో పరిశీలించాలని ఉద్యానవన శాఖ ఏడీ చిట్టిబాబును ఆదేశించారు. వ్యవసాయాధార పరిశ్రమలను నెలకొల్పి రైతులను వ్యాపారవేత్తలుగా చేయాలన్న ఆలోచన చేస్తుంటే ఆ మరునాడే ఓ పత్రికలో పేదల భూములు లాక్కుంటున్నానని వార్తలు రాయించారన్నారు. రైతుల సంక్షేమం కోసం పనిచేస్తుంటే కొందరు స్వార్థపరులు ఇలా తయారయ్యారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కొబ్బరి పంటలను కాపాడుకునేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో చికాఫ్ చైర్మన్ జోహార్‌ఖాన్, ఏఎంసీ చైర్మన్ మణిచంద్ర ప్రకాష్, పీఏసీఎస్ చైర్మన్ బాసుదేవ్ ప్రదాన్, కవిటి, కంచిలి టీడీపీ మండల అధ్యక్షులు పి.కృష్ణారావు, ఎం.రామారావు, ఉద్యానవన శాఖాధికారి పి.మాధవీలత, రైతులు పాల్గొన్నారు.

డ్రోన్‌లను వినియోగించుకోండి: ఎన్ఈఆర్

ఎచ్చెర్ల, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న డ్రోన్లను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. ఇబ్రహీంబాద్‌కి చెందిన భాగ్యలక్ష్మి కిసాన్ సీహెచ్‌సీ గ్రూపు సభ్యులకు రాయితీపై డ్రోన్‌ను మంగళవారం నడుకుదిటి పాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో డ్రోన్, పైలెట్ సర్టిఫికేట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రోన్‌తో నానో యూరియా, నానో డీఏపీ, పురుగు మందులను సులభంగా పిచికారీ చేయొచ్చన్నారు. మరిన్ని డ్రోన్‌లు రాయితీపై పంపిణీకి ప్రభుత్వంగా సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ రజని, ఏవో వి.రాజేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు సూర వెంకన్న, బీజేపీ నేతలు సంపతిరావు నాగేశ్వరరావు, సనపల రామా రావు తదితరులు పాల్గొన్నారు.

గణనాథునికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న వినాయకుడు

శ్రీకాకుళం కల్చరల్ సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఉమారుద్ర కోటేశ్వర స్వామి దేవాలయంలో వరసిద్ధి వినాయక స్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆరవెల్లి శ్రీరామశర్మ ఆధ్వర్యంలో తమలపాకులతో అర్చన చేశారు. అలాగే పాలకొండ రోడ్‌లోని విజయ గణపతి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు.

నేడు ఆలయ నూతన కమిటీ ప్రమాణం

నాగావళి నదీ తీరంలో ఉన్న ఉమారుద్ర కోటేశ్వర స్వామి ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఈవో మునగవలస సుకన్య ఒక ప్రకటనలో తెలిపారు. కమిటీ చైర్మన్‌గా పాండ్రంకి దేవేంద్ర నాయుడుతో పాటు సభ్యులు ప్రమాణం చేస్తారన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే గొండు శంకర్ హాజరవుతున్నట్లు ఆమె తెలిపారు.

సామూహిక కుంకుమ పూజలు



సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

కంచిలి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మఠం కంచిలిలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. పలువురు మహిళలు కుంకుమార్చనల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేపట్టారు.

షార్ట్‌ఫిల్మ్ విజేతలకు బహుమతులు

కవిటి, సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): బొరివంక శ్రీబాల గణపతి వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన షార్ట్ ఫిల్మ్ పోటీ విజేతలకు మంగళవారం బహుమతులు అందించారు. ఈ పోటీల్లో చిన్నకర్రివానిపాలేనికి చెందిన బన్నీటీమ్ 'బివేర్' ఫిల్మ్ ప్రథమ, ఎంఎస్‌పల్లికి చెందిన 'తప్పెవరిది'కి ద్వితీయ, బొరివంకకు చెందిన 'నాన్న మాట'కు తృతీయ బహుమతులు వచ్చాయి. అలాగే పలువురికి ప్రత్యేక బహుమతులు ప్రకటించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీరాంప్రసాద్, ఎంఈవోలు ధనుంజయ మజ్జి, ఎస్.రామ కృష్ణ, గెస్టు సంస్థ అధ్యక్షుడు బి.శంకరరావు, క్లబ్ అధ్యక్షుడు ఎల్.దీనబంధు తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న గ్రామస్థులు

టీడీపీ త్రిసభ్య కమిటీ వినతుల స్వీకరణ



త్రిసభ్య కమిటీ సమావేశంలో పాల్గొన్న నాయకులు

అరసవల్లి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధిష్టానం ఆదేశాల మేరకు శ్రీకాకుళం పార్లమెంటరీ పార్టీ మెయిన్ కమిటీ, అనుబంధ కమిటీలపై ఎమ్మెల్యేలు, స్థానిక నాయకుల నుంచి త్రిసభ్య కమిటీ సభ్యులు మంగళవారం అభిప్రాయాలు, వినతులు స్వీకరించారు. స్థానిక 80 అడుగుల రోడ్డులోని పార్టీ జిల్లా కార్యాలయంలో త్రిసభ్య కమిటీ సభ్యులు ఎండీ నజీర్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, జిల్లా పార్టీ అధ్యక్షుడు కలమట వెంకటరమణ ఈ ప్రక్రియ చేపట్టారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గొండు శంకర్, మామిడి గోవిందరావు, నాయకులు పీఎంజే బాబు, కలగ జగదీష్, పాండ్రంకి శంకర్, మాదారపు వెంకటేష్, మొదలవలస రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇది రోడ్డా.. పశువుల కొట్టమా?



చిన్నబజార్ రోడ్డులో గార వీధి వద్ద రాత్రి రోడ్డుపై అడ్డంగా ఉన్న పశువులు

శ్రీకాకుళం లీగల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరంలోని ప్రధాన మార్గాల్లో ఇది ఒకటి.. ఇటు రైతుబజార్ నుంచి స్టేట్‌బ్యాంకు వరకు ఉన్న రోడ్డు.. చిన్నబజార్ రోడ్డుగా పిలిచే ఈ మార్గంలో నిత్యం పశువులు, కుక్కలు గుంపులుగా తిరుగుతూ బాటసారులకు, వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. రోడ్డుపైనే నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నాయి. ఇలాంటి పరిస్థితి గుజరాతీపేట, పాలకొండరోడ్, జీటీ రోడ్డు తదితర ప్రాంతాల్లోనూ నెలకొని ఉంది. యజమానులు వీటిని రోడ్లపై విడిచిపెడుతున్నా నగర పాలక సంస్థ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వాహనాలు వచ్చినా కదిలే పరిస్థితి కనిపించడం లేదు. ఒక్కో సమయంలో వాహనదారులపై దాడి చేసిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు పశువులను, కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులుకోరుతున్నారు.

స్మార్ట్ కార్డులతో సందడి



అరసవల్లి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన స్మార్ట్ రేషన్ కార్డులతో పలువురు లబ్ధిదారులు మంగళవారం పలు డిపోల్లో రేషన్ సరుకులను విడిపించి ఆనందం పొందారు. కొత్త కార్డులను పట్టుకుని కంపోస్టుకాలనీ, సీతారామ టాకీస్ వద్ద డిపోల్లో రేషన్ తీసుకోవడం కనిపించింది.





సామోజీ మృతి తీరని లోటు

పలాసరూరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన తామాడ సామోజీ మృతి తీరని లోటని ప్రజాసంఘాల నేతలు అన్నారు. బొడ్డపాడులో మంగళవారం తామాడ సామోజీ మృతి చెందారు. ఆయన మృతదేహం వద్ద అమర వీరుల బంధుమిత్రుల సంఘం సభ్యులు, సీపీఐఎంఎల్ లిబరేషన్, ఏపీసీఎల్‌సీ,సీపీఎం సభ్యులు సంతాపం తెలిపారు. విప్లవోద్యమ నేపథ్యంలో ఆయన చేసిన త్యాగాలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో అమర వీరులబంధుమిత్రుల సభ్యుడు తామాడ త్రిలోచన, సీపీఐఎంఎల్ లిబరేషన్ తామాడ సన్యాసిరావు, ఏపీసీఎల్‌సీ సభ్యుడు పి.దానేసు, జీడిరైతుసాధన నాయకులు తెప్పల అజయ్‌కుమార్, కిక్కర ఢిల్లీరావు, తామాడ రామారావు, కుత్తుమ దుష్యంత్ పాల్గొన్నారు.

అధిక ధరలకు ఎరువుల అమ్మితే చర్యలు

గార రూరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ సీఐ డీవీ సతీష్ కుమార్ అన్నారు. ఈ మేరకు రామచంద్రా పురంలో ఉన్న నవజ్యోతి, దుర్గా ఎంటర్ ప్రైజెస్ ఎరువుల దుకాణాలను మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులను, నిల్వలను పరిశీలించారు. దుర్గా ఎంటర్ ప్రైజెస్ లైసెన్సు కాల పరిమితి పూర్తయినందున 1,82,733 విలువైన ఎరువుల నిల్వలను గుర్తించి అమ్మకం నిలుపుదల చేశారు. ఆయనతో పాటు ఏవో దుంపల పద్మావతి తదితరులు ఉన్నారు.

క్షతగాత్రుడికి చేయూత



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

అరసవల్లి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): గత నెలలో ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మెడికవర్ ఆసుపత్రి న్యూరో క్రిటికల్ వార్డులో చికిత్స పొందుతున్న జమ్ము గ్రామానికి చెందిన మొబైల్ టెక్నీషియన్ సాధు సోమేశ్వరరావుకు జిల్లాలోని టెక్నీషియన్లు సాయమందించారు. ఈమేరకు మంగళవారం రూ.90 వేలు నగదును అందించి మానవత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో మొబైల్ షాప్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దాము, కోశాధికారి పాపారావు, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ స్టేడియం నిర్మాణానికి చర్యలు

శ్రీకాకుళం రూరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రూరల్ మండలం పాత్రుని వలస పరిసర ప్రాంతాల్లో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి మంగళవారం ఎమ్మెల్యే గొండు శంకర్ స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఎందరో ప్రతిభ కలిగిన క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటారన్నారు. సరైన క్రీడా మైదానం లేక క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారని, క్రికెట్ అభివృద్ధికి మినీ క్రికెట్ స్టేడియంలను నిర్మించే దిశలో చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్, అధికారులతో కలిసి ముందుకు వెళ్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, సీనియర్ క్రీడాకారులు, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

పేదల గుండె చప్పుడు వైఎస్

శ్రీకాకుళం అర్బన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల గుండె చప్పుడు దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ అన్నారు. వైఎస్ వర్ధంతి సందర్భంగా ఏడురోడ్ల కూడలిలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. జిల్లాలో రిమ్స్, నిరంతరం నీటిపారుదల ప్రాజెక్టుల ద్వారా రైతులకు నీరందిస్తూ అపర భగీరథుడిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు మామిడి శ్రీకాంత్, ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు, అంధవరపు సూరిబాబు, ఎంవీపద్మావతి తదితరులు పాల్గొన్నారు.



వైఎస్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న వైసీపీ నేతలు

జాగ్రత్తలతో ఎయిడ్స్ నివారణ

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 2 (ఆంధ్ర జ్యోతి): బెల్లుపడ పీహెచ్‌సీలో ఐఈఎస్ యూత్ క్లబ్ బెజ్జిపురం, ట్రక్కర్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో మంగళవారం హెచ్‌ఐవీపై అవగాహన కలిగించారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్ తదితర వ్యాధుల వ్యాప్తి, వాటి నివారణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రవికుమార్, రాఘవ, ఫార్మాసిస్ట్ టి.రఘు, ఏఎన్‌ఎం నీలవేణి, వెంకటరమణ పాల్గొన్నారు.

థర్మల్ పవర్ ప్రాజెక్టుతో ప్రగతి

ఆమదాలవలస, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో రూ.32 వేల కోట్లతో చేపట్టనున్న సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్‌తో నియోజకవర్గం ప్రగతిపథంలో నడుస్తుందని రిటైర్డ్ తహసీల్దార్, టీడీపీ నేత పేడాడ జనార్దనరావు అన్నారు. మంగళ వారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కూన రవికుమార్ ప్రత్యేక చొరవతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ప్రాజెక్టు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నాయన్నారు. నేతలు కూన అప్పల నాయుడు, సనపల రమణారావు, బాలాజీ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

ఆమదాలవలస, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం స్త్రీశక్తి పథకం అమలు చేయడంతో బేరాలు లేక ఆటో డ్రైవర్లు నష్టపోతున్నారని, వారికి ప్రతి ఏటా రూ. 15 వేలు ఇచ్చి ఆదుకోవాలని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం డిమాండ్ చేశారు. మంగళవారం కృష్ణా పురం జంక్షన్ నుంచి ఆటో డ్రైవర్లతో కలిసి ర్యాలీ నిర్వహించారు. గతంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆటో డ్రైవర్లకు ప్రతి ఏటా రూ.10 వేలు ఇచ్చారని గుర్తుచేశారు.

ఎంబీబీఎస్ సీటు సాధించిన హోంగార్డు కుమారుడు

● ఎస్పీ మహేశ్వరరెడ్డి అభినందన



శశిధర్‌ను అభినందిస్తున్న ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పాతపట్నం సర్కిల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు చక్క వాసు దేవరావు కుమారుడు శశిధర్‌నాయుడు ఎంబీబీఎస్ సీటు సాధించడంపై ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆనందం వ్యక్తం చేసి అభినందించారు. ఇటీవల నీట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి విశాఖలోని ఎన్నారై ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ఎంబీబీఎస్ సీటు సాధించాడు. ఈ మేరకు శశిధర్ నాయుడు తల్లిదండ్రులతో మంగళవారం ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీ మాట్లాడుతూ హోం గార్డుల కుటుంబాల సంక్షేమం కోసం జిల్లా పోలీస్‌శాఖ ఎల్లప్పుడూ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఐ వెంకట రమణ పాల్గొన్నారు.

శ్రీకాకుళానికి వరం ఒక బ్రాండ్: ఎమ్మెల్యే శంకర్



వరం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంకర్, మాజీ చైర్‌పర్సన్ జయంతి తదితరులు

అరసవల్లి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): దివంగత నేత, మాజీ మునిసిపల్ ఛైర్మన్ అంధవరపు వరహా నరసింహం (వరం) శ్రీకాకుళానికి ఓ బ్రాండ్ అని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. వరం 5వ వర్ధంతి సందర్భంగా మంగళవారం నగరంలోని ఏడురోడ్ల కూడలి వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. వరం చారిటబుల్ ట్రస్టు ద్వారా 100 మంది తలసేమియా వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. పేద ప్రజల పెన్నిధిగా, కళింగవైశ్య కుల పెద్దగా తనదైన శైలిలో ప్రజా నాయకుడిగా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారని కొనియాడారు. ఆయన ఆశయాలను కుటుంబ సభ్యులు కొనసాగించడం అభినందనీయమన్నారు. మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ పైడిశెట్టి జయంతి మాట్లాడుతూ.. తన తండ్రి అడుగు జాడల్లోనే తామంతా నడుస్తున్నామని, సంఘ పెద్దల సూచనలు, సలహాలతో సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో అంధవరపు ప్రసాద్, అంధవరపు సంతోష్, కోరాడ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో నలుగురి మృతి

జిల్లాలో వేర్వేరు ఘటనల్లో నలుగురు మృతిచెందారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాధచాయలు అలముకున్నాయి.

రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని మహిళ..

సంతబొమ్మాళి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డివాడ వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో టెక్కలి మండలంలోని అక్కువరానికి చెందిన మురపాల రెయ్యమ్మ (41) మృతి చెందింది. ద్విచక్రవాహనాలు నడుపుతున్న తంగిరామారావు, నెయ్యిల రామకృష్ణలకు గాయాలయ్యాయి. సోమవారంరాత్రి బోరుభద్రలో తాపీపనుల అనంతరం అక్కువరం నుంచి ఇంటికి రెండు వేర్వేరు వాహనాల్లో వెళ్తున్నారు. ఒకదానికొకటి ఢీకొనడంతో రోడ్డుపై పడిపోయిన రెయ్యమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. ఈమేరకు సంతబొమ్మాళి ఎస్ఐ వై.సింహాచలం కేసు నమోదుచేశారు.

నాలుగు నెలల వ్యవధిలో తండ్రీకొడుకులు..

కోటబొమ్మాళి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యలమంచిలిలో తండ్రీకొడుకులు కవిటి ఆనందరావు (50), భాస్కరరావు (26)లు నాలుగు నెలల వ్యవధిలోనే మృతిచెందారు. తండ్రి ఆనందరావు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఈ ఏడాది మే 20న మృతి చెందిన విషయం విదితమే. తండ్రి మరణంతో మనస్తాపానికి గురైన కుమారుడు భాస్కరరావు అనారోగ్యంతో శ్రీకాకుళం ఓ ప్రైవేటు అనుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఇంటికి పెద్దదిక్కుగాఉన్న భర్త, పెద్ద కుమారుడు మృతిచెందడంతో తల్లి పద్మ, తమ్ముడు కృష్ణ, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఆనందరావు మృతితో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి..

కోటబొమ్మాళి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి):మండలంలో గల హరిశ్చంద్రపురం రైలు నిలయం సమీపంలో మంగళవారం గుర్తు తెలియని రైలు ఢీకొని గుర్తు తెలియని మృతి చెందాడని పలాస జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ మెట్ట సోమేశ్వరరావు తెలిపారు. మృతదేహం గుర్తు పట్టలేని విధంగా ఉందని, మృతుడివయస్సు 50నుంచి 55 ఏళ్లు ఉండవచ్చని చెప్పారు. మృతుడి కుడిచేతిపై శ్రీను అని పచ్చబొట్టు ఉందని, మృతుడి వివరాలు తెలిసిన వారు పలాస జీఆర్పీ పోలీస్ స్టేషన్‌కు సంప్రదించాలని ఆయన కోరారు.

చికిత్స పొందుతూ ఒకరు..

పొందూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ధర్మపురం గ్రామానికి చెందిన మొదలవలస వరహానరసింహులు (57) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. గత కొంతకాలంగా అనారోగ్యంతో పాటు కుటుంబంలో కలహాలతో మనస్తాపం చెంది సోమవారం రాత్రి పురుగుల మందు తాగి అపస్మారకస్థితికి చేరుకున్నాడు. వెంటనే కుటుంబసభ్యులు శ్రీకాకుళం ఆసుపత్రికి తరలించడంతో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య సరోజిని ఇచ్చిని ఫిర్యాదు మేరకు పొందూరు ఎస్ఐ వి. సత్యనారాయణ కేసు నమోదు చేశారు.

పిడుగుపడి రైతు మృతి



రమేష్(ఫైల్)

టెక్కలి రూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పోలవరం గ్రామానికి చెందిన రైతు దవళ రమేష్ (40) మంగళవారం సాయంత్రం పిడుగుపడి మృతి చెందాడు. వర్షానికి తన వరి పైరులో ఎక్కువగా చేరిన నీటిని బయటకు తీసేందుకు వెళ్లిన రమేష్ పిడుగుపాటుకు గురై మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రమేష్ మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

భార్యతో తగాదా పడి.. గొంతుకోసుకుని

● పలాసలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన కళాసీ

పలాస, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి):పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లోని కాపువీధికి చెందిన జీడి కళాసీ కోరాడ గవరయ్య భార్యతో గొడవ పడి చాకుతో గొంతుకోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆయన పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. సీఐ బి.సూర్యనారాయణ కథనం మేరకు..గవరయ్య నిత్యం మద్యం సేవిస్తు భార్యతో తగాదా పడుతుండేవాడు. పనులకు కూడా వెళ్లకుండా మద్యం తాగుతున్న క్రమంలో మంగళవారం ఉదయం కూడా భార్యతో ఘర్షణకు దిగాడు. అనంతరం భార్య ధనలక్ష్మి జీడి పిక్కల పీలింగ్ చేయడానికి వెళ్లిపోయింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో చాకు తీసుకొని మెడను కోసుకున్నారు. దీంతో ఆయన కంఠం కింద పెద్ద గాయమైంది. తీవ్ర రక్తస్రావంతో పడిఉన్న గవరయ్యను గుర్తించిన స్థానికులు సమీపంలో ఉన్న ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. ఆరోగ్యపరిస్థితి విషమిస్తుండడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు అంబులెన్స్‌లో తరలించారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

భవానీపురంలో ఏఎస్ఐ అంత్యక్రియలు

నరసన్నపేట,సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): పోలాకిలో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తూ పి.ఆదినారాయణ అంత్యక్రియలు ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు పోలీసులు అధికార లాంఛనాలతో మంగళవారం ఆదినారాయణ స్వగ్రామం భవానీపురంలో నిర్వహించారు. ఆదినారాయణ మూడు రోజుల కిందట అనారోగ్యానికి గురై శ్రీకాకుళంలోని ఓ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందిన విషయం విదితమే. అంత్యక్రియల్లో నరసన్నపేట సీఐ ఎం.శ్రీనివాసరావు పోలాకి, నరసన్నపేట ఎస్ఐలు రంజిత్, దుర్గాప్రసాద్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టుతో ఉపాధి అవకాశాలు

హరిపురం, సెప్టెంబరు2 (ఆంధ్రజ్యోతి): ఎయిర్‌పోర్టు నిర్మాణంతో ఈ ప్రాంతం అభివృద్ధికావడంతోపాటు యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని పలువురు నాయకులు తెలిపారు. మంగళవారం హరిపురంలో మందస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలో నిర్మించే గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి మద్ధతుగా సాధన కమిటీ సమావేశం నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షుడు బావన దుర్యోధన అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఏపీటీసీ ఛైర్మన్ వజ్జ బాబూరావుతోపాటు పలువురు ఉద్దానం, మందసమండల నాయకులు మాట్లాడుతూ బాధితగ్రామాల ప్రజలు, రైతులకు సరైన పరిహారం అందించేదిశగా చర్యలుతీసుకొనేలా దృష్టి సారించాలని కోరారు. ఎయిర్‌పోర్టుతో కలిగే లాభాలను ప్రజలకు తెలియజేసి నిర్మాణం జరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో దాసరి తాతారావు, లబ్బ రుద్రయ్య, సాలిన మాధవరావు, జుత్తు కూర్మారావు, అమ్మినాయుడు, నవీన్ పలాస, వజ్రపుకొత్తూరు మండలాల నాయకులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

పోలాకి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆర్‌జేపురం, వెదుళ్లవలస, గంటపేట గ్రామాల్లో ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. మంగళవారం ఆయా ఆరోగ్యకేంద్ర పరిధిలోని పలుగ్రామాల్లోని రచ్చబండల వద్ద ఆశాకార్యకర్తలు, ప్రత్యేక ఏకరూపదుస్తులు ధరించిన ట్రైనీలతో జిల్లా మలేరియా విస్తరణాధికారి, అసోసియేషన్ నాయకులు నల్లి రవికుమార్ పురవీధుల్లో అవగాహనర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీనాథ్, బరాటం లక్ష్మి, శేఖర్‌బాబు, సుజాత పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

ఎల్.ఎన్.పేట, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికలముందు ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే భవిష్యత్‌లో తగిన గుణపాఠం తప్పదని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి. రమణ తెలిపారు. మంగళవారం తురకపేట, లక్ష్మినర్సుపేట, కొమ్మువలస, మోదుగువలస, స్కాట్‌పేట, యంబరాంపాఠశాలల్లో ఉపాధ్యాయుల సమస్యలు సేకరణ, సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. అనంతరం యంబరాం ప్రాథమికోన్నతపాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమలో ఎస్టీయూ నాయకులు రామకృష్ణ పాల్గొన్నారు.



డబారులో పొలంలోని బావి నుంచి నీరు తీసుకువస్తున్న మహిళలు

పైపులైన్లు లీకై.. బురద నీరు కలిసి

● గిరిజన గ్రామాల్లో వర్షాకాలంలోనూ తాగునీటికి అవస్థలు

మెళియాపుట్టి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గిరిజనగ్రామాల్లో వర్షాకాలంలోనూ తాగునీటికి అవస్థలు తప్పడం లేదు. డబార్, సవర మర్రిపాడు, కేరాశింగి,భరణికోట పంచాయతీల్లో రెండు దశాబ్దాల కిందట వేసిన తాగునీటి పైపులైన్లు పూర్తి దెబ్బతిన్నాయి. దీంతో పలుచోట్ల తరచూలీకవుతున్నాయి.ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు బురద నీరు పైపులైన్లలో చేరడంతో తాగునీరు కలుషితమవుతోందని గిరిజనులు వాపోతున్నారు.ఆయాగ్రామాల్లో నివసిస్తున్నసుమారు వెయ్యి మంది వరకు తాగునీటికి అవస్థలకు గురవుతున్నారు. కుళాయిల ద్వారా బురదనీరు వస్తోందని, ఇవి తాగితే వ్యాధులు బారిన పడే ప్రమాదముందని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. దీంతో సమీపంలోని పంటపొలాల్లోని నేలబావులను తాగునీటికోసం ఆశ్రయిస్తున్నామని పలువురు చెబుతున్నారు. ఏళ్లకిందట ఏర్పాటుచేసిన పైపులైన్లకు పంచాయతీ అధికారులు మరమ్మతులుచేయడంలేదని విమర్శలొస్తున్నాయి. పైపులైన్లకు లీకులు అరికట్టి తాగునీరందించాలని పలువురు కోరుతున్నారు.

కోల్డ్‌స్టోరేజీ నిర్మాణానికి చర్యలు

● పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష



పలాస: మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో కోల్డ్ స్టోరేజీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. మంగళవారం పలాస ఏఎంసీ కార్యాలయంలో పాలకవర్గ సమావేశం ఛైర్మన్ మల్లా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది.

పీ-4తో పేద కుటుంబాలకు బంగారు భవిష్యత్

పీ-4 కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో పేద కుటుంబలకు బంగారు భవిష్యత్ రానుందని ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బంగారు కుటుంబాలకు సంబంధించి అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ మధుసూదనరావు, యు.శ్రీనివాసరావు, డి.ప్రసన్నకుమార్, ఎ.హారతి, వి.స్వాతి, టీడీపీ నాయకుడు పీరుకట్ల విఠల్‌రావు, దువ్వాడ శ్రీకాంత్ పాల్గొన్నారు.

గణనాథునికి పూజలు

కాశీబుగ్గ, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలో గల 17వ వార్డు గాయత్రీనగర్‌లో గల ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా ఉన్న గణనాథునికి మంగళవారం ఎమ్మెల్యే గౌతు శిరీష దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆమె వెంట ఏపీటీపీసీ ఛైర్మన్ వజ్జ బాబురావు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్, గాలి కష్టారావు,సూర్యనారాయణ,సప్ప నవీన్‌తో పాటు కమిటీ సభ్యులు జయంత్, కృష్ణ పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన శివాజీ

పలాస, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): గోవా గవర్నర్ అశోక్‌గజపతిరాజును మాజీ మంత్రి గౌతు శివాజీ విజయనగరంలోని ఆయన నివాసంలో కలిశారు. ఆయన వెంట ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఉన్నారు.

ఆహారశుద్ధి పరిశ్రమలపై అవగాహన అవసరం

పలాస రూరల్,సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆహారశుద్ధి పరిశ్రమలపై లబ్ధిదారులకు అవగాహన అవసరమని ఆహారశుద్ధిపరిశ్రమల నియంత్రణ పథకం డీఆర్పీ సునీల్ తెలిపారు. మంగళవారం పలాస మండల మహిళా సమాఖ్య భవనంలో ఆహారశుద్ధి నియంత్రణ పథకంపై అవగాహనకార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో లైవ్లీహుడ్ డీఎంపీ నారాయణరావు, ఐబీ బీపీఎం మోహనరావు, వెలుగు ఏపీఎం జాంబవతి, ఏపీఎం హరికృష్ణ, సీసీలు, ఎల్‌సీలు పాల్గొన్నారు.

కష్టకాలంలో పనిచేసే వారికి గుర్తింపు

● పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు



నామినేటె పదవుల సిఫారసు లేఖను త్రిసభ్య కమిటీకి అందజేస్తున్న ఎంజీఆర్

పాతపట్నం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): కష్టకాలంలో పార్టీకోసం పనిచేసేవారికి తగిన గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. శ్రీకాకుళంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం త్రిసభ్యకమిటీ సమావేశం జరిగింది. టీడీపీ శ్రీకాకుళం పార్లమెంటరీ పార్టీ ప్రధానకమిటీ, అనుబంధ కమిటీల్లో నామినేటెడ్ పదవులు భర్తీకోసం అధిష్ఠానం త్రిసభ్య కమిటీ నియమించిన విషయం విదితమే. సమావేశంలో కమిటీసభ్యుల్లు ఏపీ మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, టీడీపీ రాష్ట్ర ప్రధానక్యాదర్శి మహమ్మద్ నజీర్, పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు కలమట వెంకటరమణమూర్తి, కలగ జగదీష్, దాసునాయుడు, నాగళ్ల అప్పన్న పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి

● నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



మత్స్యకారులకు ఉపకరణాలు పంపిణీ చేస్తున్న బగ్గు రమణమూర్తి

పోలాకి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి కృషిచేస్తోందని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. మంగళవారం పోలాకి మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ప్రభుత్వం 50 శాతం రాయితీపై సమకూర్చిన ఉపకరణాలను మత్స్యకారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో టీడీపీ హాయంలో మత్స్యకారులకు పలు రకాల పరికరాలు రాయితీ ధరపై అందించామని తెలిపారు. వేటకు ఉపకరించే వలలను ఉచితంగా పంపిణీ చేయించేందుకు కృషిచేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎఫ్‌డీవో పి.ధర్మారావు,ఎంపీడీవో రవికుమార్,మత్స్యకార సహకార సొసైటీ అధ్యక్షుడు కోడ తాతారావు,కూటమి నాయకులు రోణంకి కృష్ణంనాయుడు, బైరి భాస్కరరావు, ఎంపీ నాయుడు, ఎం.దండాసి, షైలపల్లి త్రినాథ్, డోల ప్రసాదరావు, కె.తాతారావు, ధనలక్ష్మి, బలగ ప్రకాష్, పి.ధర్మారావు, మత్స్యకార సొసైటీల నాయకలు పాల్గొన్నారు.

ఎట్టకేలకు చెట్టు తొలగింపు



ఎండిన చెట్టు తొలగిస్తున్న కార్మికులు

నందిగాం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): నందిగాం మండల కాంప్లెక్స్‌కు వెళ్లే రహదారిలో ఎంఆర్‌సీ ఆవరణలో ఎండిన చెట్టును మంగళవారం ఎట్టకేలకు తొలగించారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో ప్రమాదకరంగా చెట్టు శీర్షికతో కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించి కార్మికులతో చెట్టును తొలగించారు. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారు ఊపిరి పీల్చుకున్నారు.

రేపు మండల సమావేశం

నందిగాం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): నందిగాం మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కుమార్ పట్నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు.ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ నడుపూరు శ్రీరామ్మూర్తి అధ్యక్షతన జరుగుతుందని, సభ్యులతో పాటు అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

గెస్టు లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నరసన్నపేట, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బోటనీ, కామర్స్, హిస్టరీ సబ్జెక్టులకు సంబంధించిన గెస్ట్ లెక్చరర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు బుధవారంలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పి.లత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈనెల నాలుగో తేదీ ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కాగా గెస్ట్ లెక్చరర్ పోస్టులకు ఒక్కరోజు ముందుగా ప్రకటన విడుదల చేయడం వెనుక పలుఅనుమానాలకు తావిస్తోంది.

విద్యార్థుల సంఖ్య పెంచండి

నందిగాం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ జూనియర్‌కళాశాలలో ఉత్తమ బోధన అందించి విద్యార్థుల సంఖ్యను పెంచాలని శ్రీకాకుళం ఇంటర్ ఆర్ఐవో దుర్గారావు సూచించారు. మంగళవారం నందిగాం ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి సురేష్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా రికార్డులు పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో నౌపడా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భీమేశ్వరరావు, స్థానిక కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మార్పు కృష్ణ మోహన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

30 మంది రక్తదానం

పోలాకి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): సాగరతీర పరిధిలోని కొత్తరేవులో యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని రక్తదాన శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ ప్రతినిధి పెంకిచైతన్యకుమార్, సీహెచ్‌వో బి.మంజు, బెహరా వనజాక్షి, లండ లక్ష్మి నాయకత్వంలో 30 మంది రక్తదానం చేయించారు.

నేత్రదానంపై అవగాహన అవసరం

● నేత్రదాన పక్షోత్సవాలు పురస్కరించుకుని ర్యాలీలు



మెళియాపుట్టి: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నేత్రదానంపై ప్రతిఒక్కరిలోనూ అవగహన అవసరమని వైద్య సిబ్బంది తెలిపారు. మంగళవారం జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా వైద్య సిబ్బంది ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

మెళియాపుట్టి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నేత్రదానం చేసి ఇతరులకు సహాయం చేయాలని ఆప్తమాలజిస్టు బీజీఎస్ ప్రసాద్ తెలిపారు.మెళియాపుట్టిలో నేత్రదాన పక్షోత్సవాలు పురస్కరించుకుని వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు.

● సంతబొమ్మాళి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక పీహెచ్‌సీలో నేత్రదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సంతబొమ్మాళి పీహెచ్‌సీ వైద్యాధికారి శివరంజని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఏడాదికి ఒక్కసారి తప్పనిసరిగా కంటి పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్ వెంకట్, అప్తలమిక్ అధికారి ఎంఆర్‌కే దాస్ పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్య పరిస్థితులపై సర్వే

నరసన్నపేట, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు వీధుల్లో జాతీయ మానసిక ఆరోగ్యసర్వేలో భాగంగా మంగళగిరి ఎయిమ్స్ కోఆర్డినేటర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో వైద్యఆరోగ్యశాఖ అధికారులు మంగళవారం మానసిక ఆరోగ్య పరిస్థితులపై సర్వే చేపట్టారు. మానసిక రోగులు పట్ల ఉదాసీనత, ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడినప్పుడు పట్టణ భౌగోళిక స్థితి తదితర అంశాలపై సర్వే చేశారు. తొలుత సచివాలయ వైద్యఆరోగ్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో సమావేశయయ్యారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కృష్ణబాబు పాల్గొన్నారు.

అక్రమాలు చెక్ పెట్టేందుకే స్మార్ట్ కార్డులు

కోటబొమ్మాళి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రజాపంపిణీ వ్యవస్థలో అక్రమాలకు చెక్ పెట్టేందుకే కూటమి ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టిందని టీడీపీ రాష్ట్రకార్యదర్శి బోయిన గోవిందరాజులు తెలిపారు. స్థానిక రెడ్డిక వీధిలో మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కళ్లి నాగయ్యరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కళ్లి లక్ష్మణ్‌రెడ్డి ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు బోయిన రమేష్, కోరాడ గోవిందరావు, మద్ది కృష్ణారావు, కళ్లి విజయకుమార్‌రెడ్డి, కళ్లి సదాశివరెడ్డి పాల్గొన్నారు.

● పాతపట్నం సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ రేషన్‌కార్డులతో మరింత పారదర్శకసేవలు అందుతాయని టీడీపీ పట్టణాధ్యక్షుడు సైలాడ సతీష్ తెలిపారు. మంగళవారం స్థానిక నీలకంఠాపురం వీధిలో స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేశారు.కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి అక్కుంద్ర సన్యాసి, కరకవలస మన్మథరావు, వార్డు సభ్యుడు దుర్గారావు సిరిపురం శంకరరావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చనలు

నందిగాం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): నందిగాం కారిగుడ్డివీధిలో ఏర్పాటుచేసిన వినాయకుని మండపం వద్ద మంగళవారం సామూహిక కుంకుమార్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో పురోహితులు ఎం.రమేష్‌శర్మ పర్యవేక్షణలో మహిళలు గణనాథునికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే జాతీయ రహదారి అండర్‌పాసేజ్ సర్వీస్ రోడ్డుసమీపంలో జైగణేష్ యూత్ ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాల్లో భాగంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ వహించాలి

పలాస, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై శ్రద్ధవహించాలని డీవీఈవో ఆర్.సురేష్‌కుమార్ కోరారు. మంగళవారం పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా అధ్యాపకులతో మాట్లాడుతూ ఇప్పటి నుంచే ఉత్తమ ఫలితాల సాధనకు చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులు ప్రశ్నించేతత్వాన్ని అలవరుచుకునే విధంగా తర్ఫీదు ఇవ్వాలన్నారు. అనంతరం కళాశాలలో రికార్డులు పరిశీలించారు.

జాబ్‌మేళాలో సత్తాచాటిన విద్యార్థులు

జాబ్‌మేళాలో సత్తాచాటిన పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులను ప్రిన్సిపాల్ జె.వెంకటలక్ష్మి అభినందించారు. టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాజూనియర్ టెక్నీషియన్లగా 23 మంది, మిషన్ ఆపరేటర్లగా 11, అసెంబుల్‌ఆపరేటర్ ఉద్యోగాలకు ఆరుగురు ఎంపికయ్యారు.వీరంతా చెన్నై, హైదరాబాద్‌లో విధులు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

ఘనంగా పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు

జిల్లాలో వ్యాప్తంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జనసేన, కూటమి నాయకులు ఆలయాల్లో పూజలు, రక్తదాన శిబిరాలు నిర్వహించారు. పలు సేవా కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. పలుచోట్ల అభిమానులు కేకులు కట్‌చేశారు.

- ఆంధ్రజ్యోతి బృందం



ఇచ్ఛాపురం: కంప్యూటర్ శిక్షణ ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ అశోక్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు



రణస్థలం: కేక్ కట్ చేసి అభిమానులకు తినిపిస్తున్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు



అరసవల్లి: రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్



ఆమదాలవలస: రక్తదానంచేసిన వారికి సర్టిఫికెట్ అందజేస్తున్న జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పేడాడ రామ్మోహన్‌రావు



టెక్కలి: అభిమానులతో కలిసి కేక్ కట్‌చేస్తున్న జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కణితి కిరణ్‌కుమార్



నరసన్నపేట: రక్తదాతను అభినందిస్తున్న జనసేన నియోజవర్గ ఇన్‌చార్జి బలగ ప్రవీణ్